
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



సోమశిలలో 61.28 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 61.28 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3830 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.89,260
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,070
3 శాతం జీఎస్టీతో	రూ.8,312
వెండి (8 గ్రా)	రూ.66,496

గరిష్టం/కనిష్టం 33.2 /23.0

వాతావరణం

జిల్లాలో వాతావరణం శుక్రవారం సాధారణంగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 67 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నేడు

నెల్లూరు (పొగతోట): నగరంలోని జెడ్పీ కార్యాలయంలో స్థాయీ సంఘ సమావేశాలను శుక్రవారం నిర్వహించనున్నామని సీఈఓ విద్యారమ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశాలకు ఆయా శాఖల జిల్లా అధికారులు, సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఆర్పీ సిసోడియాతో భేటీ



పుష్పగుచ్ఛమిస్తున్న కలెక్టర్

నెల్లూరు(అర్బన్): రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామ్‌ప్రసాద్ సిసోడియా నగరానికి గురువారం చేరుకొని ఓ హోటల్లో బస చేశారు. ఆయనకు కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలోని రెవెన్యూ సమస్యలపై చర్చించారు. రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు.

విజయదీపిక పుస్తకాల అందజేత



సంగం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ గురువారం సందర్శించారు. పాఠశాలలో విద్యాబోధనపై ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులకు విజయదీపిక పుస్తకాలను అందజేసి, పరీక్షలను విజయవంతంగా రాసి ఉత్తమ ఫలితాలను సాధించాలని కాంక్షించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలను ఆమెకు తెలియజేశారు. ఎంపీడీఓ షాలెట్, ఎంఈఓ మల్లయ్య పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలపై శిక్షణ రేపు

నెల్లూరు (టౌన్): ఇంటర్ పబ్లిక్ పరీక్షలపై నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో చీఫ్, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, కస్టోడియన్లకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నామని ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం చీఫ్ సూపరింటెండెంట్లకు కేంద్రానికి సంబంధించి పరీక్ష సామగ్రిని అందజేయనున్నామని వివరించారు.

ఏపీపీగా రఫీమాలిక్



నెల్లూరు (లీగల్): నెల్లూరు ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు ఏపీపీగా సీనియర్ న్యాయవాది రఫీమాలిక్‌ను నియమిస్తూ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం గురువారం జారీ చేసింది. ఏపీపీగా మూడేళ్లు ఆయన కొనసాగనున్నారు. కాగా ఆయనకు పలువురు అభినందనలను తెలియజేశారు.

పెట్రోల్ కల్తీపై ఆందోళన



కల్తీ అయిన పెట్రోల్‌ను పరిశీలిస్తున్న ఎస్సై అంకమ్మ

ఉలవపాడు: ఉలవపాడులోని హెచ్‌పీ అవుట్‌లెట్లో పెట్రోల్ కల్తీ జరిగిందంటూ వాహనదారులు ఆందోళనను గురువారం చేపట్టారు. కల్తీ పెట్రోల్‌తో తమ వాహనాలు ఆగిపోయాయని, మెకానిక్ వద్దకు తీసుకెళ్లగా ఇదే విషయాన్ని నిర్ధారించడంతో సుమారు 15 మంది వచ్చి యజమానులను నిలదీశారు. టెస్టింగ్ చేసే ఫిల్టర్ కాగితాన్ని దాదాపు గంట పాటు ఇవ్వలేదు. వాహనం నుంచి తీసిన పెట్రోల్‌తో పాటు అక్కడే మరో బాటిల్‌లో పట్టించారు. పరీక్షించాలని కోరగా, వారు నిరాకరించి ఏదో తప్పు జరిగిందని తెలియజేశారు. వాహనదారుల ఫిర్యాదుతో ఎస్సై అంకమ్మ వచ్చి తనిఖీ చేయాలని నిర్వాహకులను ఆదేశించడంతో పరీక్ష చేశారు. ఫిల్టర్ పేపర్‌పై పోయగా, మరకలతో తడి ఆరకుండా ఉండటంతో కల్తీ పెట్రోల్‌గా నిర్ధారించారు. కంపెనీ వారు వచ్చి తనిఖీ చేసి మార్చేంత వరకు బంక్‌ను మూసేయాలని ఆదేశించారు. ఈలోపు నిర్వాహకులు ప్రాధేయపడి, వారి వాహనాలను బాగు చేయించేలా మాట్లాడుకున్నారు. వీరికి నగదును ఇచ్చారని సమాచారం. కాగా పెట్రోల్ కల్తీపై విచారణ జరపాలంటూ హెచ్‌పీ సేల్స్ అధికారి, నెల్లూరు డీఎస్‌ఓకు ఫిర్యాదు చేశారు.

మత్స్యకారుల హాహాకారాలు

సువిశాల తీరం.. అపార మత్స్య సంపద.. ఎగుమతులతో జిల్లాలోని మత్స్యకారులు గతంలో ఎంతో సంతోషంగా ఉండేవారు. అయితే చేపల వేట ప్రస్తుతం తీవ్ర నిస్పృహను కలిగిస్తుండటంతో మత్స్యకారులు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వేటకెళ్లినా తగినంత మత్స్య ఉత్పత్తులు లభించకపోవడం వీరిని బాధిస్తుంటే.. అధునాతన పడవలతో తమిళ జాలర్లు వీర విహారం చేస్తుండటం మరింత ఆవేదనకు గురిచేస్తోంది.


నానాటికీ తగ్గుముఖం పడుతున్న మత్స్య సంపద

- కుటుంబపోషణ సాగక కూలీలుగా మారుతూ..
- మరోవైపు తమిళ బోట్ల ఆగడాలు
- పట్టించుకోని మత్స్యశాఖ అధికారులు

జిల్లాలో తీర మండలాలు	9
గ్రామాలు	98
సముద్ర తీరం పొడవు	110 కి.మీ.
మత్స్యకారులు	1.98 లక్షల మంది



ఒడ్డున ఉన్న వేట సామగ్రి



అరకొరగా వచ్చిన మత్స్యసంపదను విక్రయిస్తూ..

కావలి: సమస్యల వలయంలో గంగపుత్రులు విలవిల్లాడుతున్నారు. సముద్రంలో చేపల వేటకెళ్లినా, తగినంత చేతికందక ఆర్థికంగా నష్టపోతూ ఏమి చేయాలో పాలుపోక అయోమయానికి గురవుతున్నారు. మత్స్యశాఖ అధికారులు, సిబ్బంది వీరి యోగక్షేమాలను ఆరాతీసే అంశాన్ని విస్మరించారు. పట్టణాల్లో ఉంటూ హాజరు పట్టికల్లో సంతకాలు పెట్టడమే తమ విధులనే రీతిలో వ్యవహరిస్తున్నారు. మత్స్యకార గ్రామాల్లో తిరుగుతున్నామంటూ ఫొటోలు తీసుకొని ప్రభుత్వానికి నకిలీ నివేదికలు పంపడానికే పరిమితమవుతున్నారు.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

సముద్ర ఒడ్డు నుంచి 23 కిలోమీటర్ల అవతల అంతర్రాష్ట్ర జలాలు. ఈ ప్రాంతంలో ఇతర రాష్ట్రాలకు చెందిన బోట్లు చేపల వేట సాగించొచ్చు. అయితే తమిళ తంబీలు రాష్ట్ర జలాల్లోనూ చేపల వేట సాగిస్తూ స్థానికుల పొట్టకొడుతున్నారు. వాస్తవానికి తమిళనాడులోని నాగపట్నం, కడలూరు, పుదుచ్చేరిలోని కారైకల్ తదితర తీర ప్రాంతాలు భారీ మత్స్య సంపదను ఎగుమతి చేసే కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయి. ఈ మూడు చోట్ల కోట్లకు పడగలెత్తిన వ్యక్తులు భారీ ఇంజిన్లతో కూడిన బోట్లను కొనుగోలు చేసి కూలీలుగా జాలర్లను నియమించి వారి ద్వారా సముద్రంలో చేపల వేట సాగిస్తుంటారు. స్థానిక మత్స్యకారుల బోట్లు గంటకు 20 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తే, తమిళ బోట్లు 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటాయి. వీరి వద్ద వలలూ అధునాతనమైనవి. వందల కిలోల బరువు ఉండే చేపలను సైతం సునాయసంగా ఒడిసిపట్టుకో గలిన సామర్థ్యం వీటి సొంతం. స్థానిక మత్స్యకారులు సముద్రంలో వలలేశాక వాటిని ఒక బృందంగా బోట్లలోకి లాగుతారు. అదే తమిళ బోట్లలోని జాలర్లు మినీ క్రేన్లతో వలలను లాగుతారు.

తమిళ బోట్లతో జీవనోపాధికి గండి

సముద్ర జలాల్లో తమిళ జాలర్లు మరబోట్లతో చేపల వేట సాగిస్తున్నా, స్థానిక మత్స్యకారులు అడ్డుకోలేక నిస్సహాయులుగా ఉండిపోతున్నారు. స్థానికుల వద్ద ఉండే తెప్పలు, బోట్లు, వలలు చాలా సాధారణమైనవి. తెప్పలతో చేపల వేట సాగించే వారు ఒడ్డు నుంచి దాదాపు నాలుగున్నర నాటికల్ మైళ్లు (ఎనిమిది కిలోమీటర్ల) వరకు వెళ్లొచ్చు. ఇక ఇంజిన్ బోటు ఒడ్డు నుంచి ఎనిమిది కిలోమీటర్లు దాటాక సముద్రంలోకి వెళ్లి వేట చేసుకోవాలి. ఇవీ మత్స్యశాఖ అమలు చేస్తున్న నిబంధనలు. అయితే మత్స్య సంపద మందగించడంతో దొరకడం లేదని, కనీసం డీజిల్‌కయ్యే ఖర్చుకు సరిపడా లభించడంలేదని మత్స్యకారులు వాపోతున్నారు. చేసేది లేక కొందరు రోజువారీ కూలీలుగా మారారని, మరికొందరు జీవనోపాధి కోసం పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లి వేరే పనులు చేసుకుంటున్నారని మత్స్యకారులు తెలిపారు.



వలను సరి చేసుకుంటూ..

రెక్కల కష్టం వృథా



సముద్రంలో చేపల వేటకు తెల్లవారుజామున సంప్రదాయ తెప్పతో వెళ్లినా, ప్రయోజనం ఉండటం లేదు. వలను ఎన్నిసార్లు విసిరినా చేపలు పడటం లేదు. తమిళ బోట్లు వచ్చి చేప పిల్లలను సైతం ఊడ్చేస్తున్నాయి. రెక్కల కష్టం వృథా అవుతుండటం బాధ కలిగిస్తోంది.

– వాయిల శ్రీనివాసులు, మత్స్యకారుడు, రాముడుపాళెం, కావలి రూరల్ మండలం

చేప పిల్లలనూ ఉంచడంలేదు



తమిళ బోట్లు మన జలాల్లోకి వచ్చి చేప పిల్లలను సైతం ఉంచడం లేదు. ఇటీవలి కాలంలో వీరి తాకిడి శ్రుతిమించిపోయింది. తమిళ బోట్లు ఎక్కడైనా ఉన్నాయననే అంశాన్ని గమనించాల్సి వస్తోంది. వీరికి దూరంగా చేపల వేట సాగించాలి. లేకపోతే వలలను ధ్వంసం చేసి నష్టపరుస్తారు. వేటకెళ్లినా నలుగురికి కూలి గిట్టుబాటు కావడం లేదు.

– పనుముల వెంకటేశ్వర్లు, మత్స్యకారుడు, కొత్తసత్రం, కావలి రూరల్ మండలం

పట్టించుకోని అధికారులు



తమిళ బోట్లతో స్థానిక మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతున్నారు. జిల్లాలోని అన్ని తీర ప్రాంత గ్రామాల్లో తాబేళ్లు చనిపోయి ఒడ్డుకు చేరాయంటే పరిస్థితి ఎలా దాపురించిందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్ర జలాల్లోకి తమిళ బోట్లు అక్రమంగా వచ్చి మత్స్య సంపదను కొల్లగొడుతున్నా, అధికారులు పట్టించుకోవడంలేదు.

– కొమారి రాజు, మత్స్యకార నేత, తుమ్మలపెంట, కావలి రూరల్ మండలం

అన్నీ సమస్యలే..

మత్స్యకారులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు, ఐస్ ప్లాంట్ల కొరత, మార్కెట్ సమాచారంపై అవగాహన లేమి, చేపల నాణ్యతలో అనిశ్చితి, తూకం విధానంలో లోపం, మౌలిక సదుపాయాలు లోపించడం, నిరక్షరాస్యత తదితర సమస్యలతో వీరు సతమతమవుతున్నారు. ఉత్పత్తుల రవాణాలోనూ వీరికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

వేటే ఆధారం

జిల్లాలోని తొమ్మిది తీర మండలాల్లో 110 కిలోమీటర్ల మేర సముద్ర ప్రాంతం విస్తరించింది. 98 గ్రామాల్లో 1.98 లక్షల మంది మత్స్యకారులు నివసిస్తున్నారు. వీరిలో 53,541 మంది సముద్రంలో చేపల వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. 867 సంప్రదాయ, 3704 మోటార్ బోట్లు ఉన్నాయి. సాధారణంగా మత్స్యకారులు మోటార్ బోట్లలో వేటకెళ్తారు.

గతమెంతో ఘనం

సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో రాష్ట్రంలోనే నెల్లూరు జిల్లా గతంలో ద్వితీయ స్థానంలో ఉండేది. జిల్లా పరిధిలోని తీరం నుంచి ఏడాదికి సుమారు 10 లక్షల టన్నుల మత్స్య సంపద వస్తుంటే, అందులో స్థానిక మార్కెట్లో సుమారు నాలుగు లక్షల టన్నుల మేర విక్రయాలు జరిగేవి. మిగిలినవి ఎగుమతయ్యేవి. ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చేపలు వెళ్తుండగా, రొయ్యలు మాత్రం ఇతర దేశాలకు ఎక్స్‌పోర్ట్ అయ్యేవి.

ప్రశ్నిస్తే.. కన్నెర్రే..!

- ఉదయగిరిలో పేట్రేగిపోతున్న తమ్ముళ్లు
- అగ్రిగోల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలపై దాడి
- విధుల్లో ఉన్న వీఆర్వోపై దౌర్జన్యం
- యథేచ్ఛగా అక్రమాలు
- నిస్తేజంగా పోలీస్ యంత్రాంగం



అగ్రిగోల్డ్ బాధితులు, సీపీఐ నేతలను అడ్డుకుంటున్న టీడీపీ శ్రేణులు (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఉదయగిరి నియోజకవర్గంలో తమ్ముళ్ల ఆగడాలు రోజురోజుకూ శ్రుతిమించుతున్నాయి. ఆగడాలు, అన్యాయాలు, దోపిడీలు, దౌర్జన్యాలు, అక్రమాలను ఎవరైనా ప్రశ్నిస్తే తట్టుకోలేకపోతున్నారు. ప్రభుత్వోద్యోగులు, సామాన్యులు, ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులపై దాడులకు తెగబడుతున్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వికటాట్టహాసం పొందుతుండటంతో ఇది ప్రజాస్వామ్యమా.. లేక అటవిక రాజ్యంలో ఉన్నామాననే సందేహం కలుగుతోంది. నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు దీనికి బలం చేకూరుస్తున్నాయి.

బరితెగిస్తూ.. పైశాచికానందం

కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఉదయగిరి నియోజకవర్గంలోని కొన్ని మండలాల్లో టీడీపీ నేతల ఆగడాలు శ్రుతిమించుతున్నాయి. ఇసుక, మట్టి, గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఉపాధి హామీ పనుల్లో భాగంగా మంజూరైన సిమెంట్ రోడ్లు, మిని గోకులాల్లో ప్రతిపక్ష పార్టీ ప్రజాప్రతినిధుల పాత్రను నిర్వీర్యం చేశారు. దీనిపై ప్రశ్నించిన సర్పంచ్‌ల చెక్‌పవర్‌ను రద్దు చేస్తామని బెదిరించారు. ఎవరైనా గట్టిగా నిలబడితే అక్రమ కేసులు బెట్టి వేధింపులకు గురిచేస్తున్నారు.

నాలుక చీరేస్తాం

వరికుంటపాడు మండలంలోని అగ్రిగోల్డ్ భూముల్లో కొంతకాలంగా జామాయిల్ సంపదను కొల్లగొడుతున్నారు. ఈ విషయమై రెవెన్యూ, పోలీస్, సీఐడీ అధికారులకు సీపీఐ, అగ్రిగోల్డ్ కస్టమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ఫిర్యాదు చేశారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో తహసీల్దార్, పోలీస్‌స్టేషన్ల ఎదుట రాష్ట్రస్థాయి నేతలు, అగ్రిగోల్డ్ బాధితులు రెండు రోజుల క్రితం ధర్నా చేపట్టారు. తమ మండలంలో ధర్నాలను ఎందుకు చేస్తున్నారని, మరోసారి వస్తే నాలుక చీరేస్తామంటూ వారిపై కొందరు టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యానికి పాల్పడటం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ దాడులపై పోలీస్ ఉన్నతాధికారులకు తెలియజేసినా, ఎలాంటి చర్యల్లేవని బాధితులు వాపోతున్నారు.

వేధింపులకు పరాకాష్ట

- కొండాపురం మండలం మర్రిగుంటలో గ్రావెల్ అక్రమ తవ్వకాలను అడ్డుకున్న ఓ ఎస్సీ సర్పంచ్‌పై అక్రమ కేసుల పేరుతో బెదిరింపులకు దిగారు. సదరు సర్పంచ్‌ను మండల కార్యాలయంలోకి అడుగుపెట్టనివ్వొద్దంటూ అధికారులకు స్వయంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హుకుం జారీ చేశారు.
- అదే మండలం యర్రబాలెనికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ట్రాక్టర్‌లో వస్తుంటే, టీడీపీ కార్యకర్తలు అడ్డుకొని దాడి చేశారు. అయితే వారిపై ఎలాంటి చర్యలు చేపట్టకుండా బాధితుడిపైనే హత్యాయత్నం కేసు నమోదు చేసి జైలుకు పంపారు.
- తాజాగా రెండు రోజుల క్రితం వరికుంటపాడు మండలం తోటల చెరువుపల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ప్రసాద్‌పై టీడీపీ శ్రేణులు దాడి చేశారు. ఇలా అనేక మండలాల్లో టీడీపీ కార్యకర్తల దాష్టీకాలు కొనసాగుతూనే ఉన్నాయి.

చొక్కా పట్టుకొని దౌర్జన్యం

కలిగిరి మండలం పెదకొండూరు వీఆర్వో నరేష్ చొక్కా పట్టుకొని టీడీపీ నేత ప్రసాద్ దౌర్జన్యం చేసిన ఉదంతంపై ఉద్యోగులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో తాము చెప్పిందే చేయాలంటూ పలు సచివాలయ ఉద్యోగులపై ఆ పార్టీ నేతలు ఒత్తిడి తెస్తుండటంతో తట్టుకోలేక పలువురు ఉద్యోగులు సెలవుపై వెళ్లిన సందర్భాలూ ఉన్నాయి. వీటిని అడ్డుకోవాల్సిన పోలీస్ యంత్రాంగం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తోంది. దీంతో నియోజకవర్గంలో పనిచేయాలంటేనే ఉద్యోగులు వెనుకంజ వేస్తున్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఆల్ పాస్

నెల్లూరు(అర్బన్): ఎంబీబీఎస్ ఫైనలియర్ ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో నగరంలోని ఏసీఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. 177 మంది వైద్య విద్యార్థులు పరీక్ష రాయగా, అందరూ ఉత్తీర్ణులై డాక్టర్ పట్టాను అందుకోనున్నారు. గతేడాది 164 మంది పరీక్షలు రాయగా, 154 మంది పాసై 93.9 శాతం విజయాన్ని నమోదు చేసుకున్నారు. ఈ ఏడాది నూరు శాతం పాస్ కావడంతో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఘనత సాధించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ రాజమన్నార్ మాట్లాడారు. ఇదే స్ఫూర్తితో వైద్యకళాశాలను ముందుకు నడుపుతామని చెప్పారు.

పకడ్బందీగా గ్రూప్ – 2 మెయిన్స్

- కలెక్టర్ ఆనంద్



సూచనలిస్తున్న ఆనంద్

నెల్లూరు రూరల్: జిల్లాలో గ్రూప్ – 2 మెయిన్స్ పరీక్షలను పక్కాగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో పరీక్షల సమన్వయాధికారి, కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, డీఆర్వో ఉదయభాస్కర్ రావుతో కలిసి అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఏడు కేంద్రాల్లో ఆదివారం ఉదయం, మధ్యాహ్నం పరీక్షలను నిర్వహించనున్నారని వెల్లడించారు. ఈ కేంద్రాలకు లైజనింగ్ అధికారులుగా ఏడుగుర్ని నియమించామని పేర్కొన్నారు. 4102 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని చెప్పారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, సీసీ కెమెరాల ఏర్పాటు తదితరాలను పర్యవేక్షించాలన్నారు. సమీపంలోని జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలు తెరుచుకోకుండా, 144 సెక్షన్‌ను అమలు చేయాలని చెప్పారు. సెల్‌ఫోన్లను పరీక్ష కేంద్రంలో డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు. ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ కృష్ణవేణి, సెక్షన్ అధికారులు అంజన, రమణ, లైజనింగ్ అధికారులు శ్రీధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

పెత్తందారులకు జీహుజూర్

- విడవలూరులో లోపభూయిష్టంగా ఆక్రమణల తొలగింపు
- టీడీపీ మద్దతుదారులకైతే ఓకే..
- ఇతరులవైతే ధ్వంసమే
- సర్వే అధికారుల అవతారమెత్తిన పచ్చ నేతలు



ఆక్రమణల పేరిట ధ్వంసం చేసిన పూరి గుడిసె



మార్కింగ్ వేసినా తొలగింపునకు నోచుకోని వాటర్ ప్లాంట్

విడవలూరు: స్థానికంగా ఆక్రమణల తొలగింపు వ్యవహారం లోపభూయిష్టంగా మారింది. ఈ అంశంలో టీడీపీ నేతలు రంగప్రవేశం చేసి, తమకు అనుకూలంగా ఉండే వారి ఆస్తులను తొలగించకుండా.. ఇతరులవి ధ్వంసం చేసేలా రూపకల్పన చేశారు. వీరే సర్వే అధికారులుగా అవతారమెత్తారంటే ఏమి జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. టీడీపీ నేత పక్కనే ఉండి తమకు అనుకూలంగా ఉన్న వ్యక్తుల ఇంటికి ఒకలా.. ఇతరుల గృహాలకు మరోలా మార్కింగ్‌లను వేయించారు. బాధిత కుటుంబాలు ప్రశ్నిస్తే, రోడ్డు క్రాస్ తిరిగిందంటూ అధికారులు సమాధానమిచ్చారు.

జరిగిందిదీ..

విడవలూరులోని సినిమా హాల్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఉన్న బుచ్చి – ఊటుకూరు రోడ్డును ఇరువైపులా ఆక్రమించారని, దీన్ని తొలగించి వెడల్పు చేయాలంటూ లోకాయుక్తను ఓ వ్యక్తి ఆశ్రయించారు. దీంతో ఆర్‌అండ్‌బీ స్థలాలను సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ క్రమంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థలాల్లో మార్కింగ్‌లను సర్వే అధికారులు వేశారు. వీటిని ఈ నెల 12న తొలగించాలని, లేని పక్షంలో తామే రంగంలోకి దిగుతామంటూ నోటీసులను పంచాయతీ అధికారులు జారీ చేశారు. కాగా గృహాలను కూల్చేస్తే తామంతా రోడ్డున పడతామని, మరోసారి సర్వే చేసి న్యాయం చేయాలంటూ నెల్లూరులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికతో పాటు తహసీల్దార్‌కు అర్జీలను పలువురు అందజేశారు. దీంతో ఆక్రమణల తొలగింపును వాయిదా వేశారు. మరోసారి రీసర్వే చేసి కొత్త మార్కింగ్‌లు వేశారు.

అంతా కక్షపూరితం..

ఆక్రమణల తొలగింపు ప్రక్రియను ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, సర్వే, పోలీస్, పంచాయతీ అధికారులు ఈ నెల 18న ప్రారంభించారు. ఇందులో టీడీపీ నేతలు దగ్గరుండి తాము వేసిన తప్పుడు మార్కింగ్‌ల మేరకే తొలగించాలంటూ పట్టుబట్టి అధికారులను ఒత్తిళ్లకు గురిచేశారు. అనుకున్న విధంగా ఇష్టానుసారంగా వ్యవహరించి కక్షపూరితంగా తొలగింపు ప్రక్రియను పూర్తి చేశారు.

వీపీఆర్ వాటర్ ప్లాంటా.. ఎక్కడా..?

రోడ్డు ఆక్రమణల పేరుతో గ్రామంలోని వారిని నష్టపర్చారు. అయితే రోడ్డు పక్కన ఆక్రమణలో ఉన్న వీపీఆర్ వాటర్ ప్లాంట్‌ను మాత్రం విస్మరించారు. దీని పక్కనే నివాసముంటున్న 70 ఏళ్ల రఘురామయ్య పూరి గుడిసెను కూల్చేసి రోడ్డున పడేశారు.

టీడీపీ కార్యాలయానికి లైన్ క్లియర్

విడవలూరులోని మద్యం దుకాణానికి ఎదురుగా ఉన్న అరటి తోటను బుధవారం సాయంత్రం తొలగించారు. దీనికి సంబంధించి యజమానికి ఎలాంటి నోటీసులను ఇవ్వలేదు. 50 ఏళ్లుగా ఉంటున్న స్థలంలో చెట్లతో సహా తొలగించడంపై యజమాని రవి లబోదిబోమన్నారు. ముందు ఉన్న మూడు గృహాలను తొలగించడంతో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అరటితోట పక్కనే ఉన్న టీడీపీ మండల నేత పొలంలో పార్టీ కార్యాలయాన్ని నిర్మించాలనే ఉద్దేశంతోనే ఈ దుర్మార్గానికి ఒడిగట్టారని ఆరోపిస్తున్నారు. అసలు కేసులేసింది పచ్చ పార్టీ నేతలే అయి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

డీసీఎంఎస్ నిర్వీర్యం

కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లా కో– ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. అన్నదాతలకు సేవలందించలేని స్థితికి చేరుకుంది. ఉద్యోగులకు జీతాలివ్వడం గగనమైంది. ఇంత వరకు పాలకమండలిని ఏర్పాటు చేయలేదు.

ఒకప్పుడు రైతాంగానికి అండగా..

- నేడు సేవలు అందించలేని స్థితిలో..
- నష్టాల బాటలో పయనం
- ఉద్యోగులకు జీతాలివ్వడం కష్టమే..
- అవినీతి ఆరోపణలతో రాజీనామా చేసిన జీఎం



నెల్లూరులోని డీసీఎంఎస్ ప్రధాన కార్యాలయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 1942వ సంవత్సరంలో డీసీఎంఎస్ ఏర్పాటైంది. సబ్సిడీపై రైతులకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు పంపిణీ చేయడం నుంచి జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలకు ఫల సరుకులు, ఎన్నికల సమయంలో స్టేషనరీ, టీటీడీకి కందిపప్పు తదితరాలను అందించింది. ప్రజలకు నాణ్యమైన వస్త్రాలు, దీపావళి సమయంలో సరసమైన ధరలకు బాణసంచా, చక్కెర, కందిపప్పు లాంటి విక్రయాలు చేసిన చరిత్ర సొసైటీకి ఉంది. అదేవిధంగా జిల్లాలో పలు ప్రాంతాల్లో ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించి తద్వారా వచ్చే కమీషన్‌తో లాభాలు ఆర్జించింది. జిల్లాలో పలుచోట్ల విలువైన ఆస్తులను కూడా సంపాదించింది. కరోనా సమయంలో కూరగాయలు పంపిణీతోపాటు, జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి ఆర్థిక సాయం చేసింది.

నేడు ఇలా..

ఎంతో ఘన చరిత్ర కలిగిన డీసీఎంఎస్ నేడు ఉనికి కోల్పోయే స్థితికి చేరుకుంటోంది. సొసైటీకి సొంతంగా నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో సొంత కార్యాలయ భవనం ఉంది. నవాబుపేటలో ఎకరా స్థలంలో రైస్‌మిల్లు, ఆత్మకూరులో షాపింగ్ కాంప్లెక్స్‌లున్నాయి, వీటిలో అత్యధిక విలువైనది రైస్‌మిల్లు. ఇది శిథిలావస్థకు చేరుకోవడంతో దాని స్థానంలో షాపింగ్ కాంప్లెక్స్, గోదాములు కట్టి బాడగకు ఇచ్చి సొసైటీకి ప్రధాన ఆదాయవనరుగా చేయాలని గత చైర్మన్ వీరి చలపతిరావు ప్రతిపాదించి ఆ మేరకు ప్రభుత్వం నుంచి అనుమతులు కూడా తెచ్చారు. దీంతో మిల్లును పడగొట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. సొసైటీ నేడు జనరిక్ ఔషధాల దుకాణం, ఎరువుల విక్రయ కేంద్రాన్ని మాత్రమే నడుపుతోంది. అయితే ఈ రెండూ వ్యాపారాలు నామమాత్రంగా సాగుతున్నాయి. గతంలో లాభాల బాటలో పయనించిన డీసీఎంఎస్ నేడు ఉద్యోగులకు జీతాలివ్వలేని స్థితికి చేరుకుంది. హామాలీలకు రూ.30 లక్షలకు పైగా వరకు బకాయిలు చెల్లించాల్సింది.

సవాలక్ష కారణాలు

డీసీఎంఎస్‌కు సుదీర్ఘంగా బీఎంగా వ్యవహిస్తున్న ఓ వ్యక్తి తన రాజకీయ పలుకుబడితో అధికారం చలాయిస్తూ అక్రమాలకు పాల్పడినట్లు విమర్శలున్నాయి. కొందరు కింది స్థాయి ఉద్యోగులు కూడా అవినీతి బాటపట్టారని ప్రచారం ఉంది. బీఎం, ఉద్యోగుల మధ్య ఏర్పడిన వివాదాలు, కోర్టు కేసులు లాంటి వ్యవహారాలతో సొసైటీ అభాసుపాలైంది. సంస్థ అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అధికారి తన అనుయాయులకు ఉద్యోగాల ఇప్పించడం, ఇతర ఉద్యోగులతో కక్షపూరితంగా వ్యవహరించడంతో ఇరువర్గాల మధ్య కోల్డ్‌వార్ నడిచింది. వ్యక్తిగత దూషణలు, కేసులు పెట్టుకోవడం వరకు వెళ్లడంతోనే సంస్థ ప్రతిష్ట దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. భారీగా నిధులను దుర్వినియోగం చేయడంతో అంతంతమాత్రంగా ఆదాయంతో ఉన్న డీసీఎంఎస్ నేడు తీవ్ర నష్టాల్లో నడుస్తోంది.

గాడితప్పిన పాలన

కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు డీసీఎంఎస్‌కు పాలకమండలిని నియమించలేదు. దీంతో పాలన పూర్తిగా గాడి తప్పింది. డీసీఎంఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

ఉద్యోగుల తొలగింపు

బీఎంగా వ్యవహరించిన వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా అవుట్ సోర్సింగ్ విధానంలో కొందరిని ఉద్యోగులుగా తీసుకున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో స్పెషల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న జేసీ 12 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను విధులు నుంచి తొలగించారు. నేడు నలుగురు మాత్రమే విధుల్లో ఉన్నారు. బీఎం తన పదవికి రాజీనామా చేసి వెళ్లిపోయారు. కొద్దిరోజుల క్రితం కలెక్టర్ ఆనంద్ నూతన బిజినెస్ మేనేజర్ (బీఎం)గా సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న మోహన్‌కృష్ణను నియమించారు.

నీరు - చెట్టులో దోచుకున్న వ్యక్తి సోమిరెడ్డి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నెల్లూరు(బారకాసు): 'నీరు – చెట్టు పనుల్లో దోచుకున్న వ్యక్తి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. ఆయనకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదు' అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిరెడ్డి అన్నారు. గురువారం నెల్లూరు నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో కాకాణి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విమర్శించే వ్యక్తికి స్థాయి ఉండాలన్నారు. సోమిరెడ్డి విషయం ఏమిటనేది నెల్లూరుకు వచ్చి చూస్తే తెలుస్తుందని టీడీపీ అధిష్టానానికి సూచించారు. ఆయన ఎంత దోచుకున్నాడో తెలుస్తుందని చెప్పారు. సోమిరెడ్డి మాట్లాడిన మాటలకు యూట్యూబ్‌లో కామెంట్స్ చూస్తుంటే అతను ఎటువంటి వ్యక్తి, ఎంతమాత్రపు వ్యక్తి అని అందరికీ అర్థమవుతోందన్నారు.

ఎంపీడీఓల నియామకం

నెల్లూరు(పొగతోట): ఉమ్మడి జిల్లాలో నాలుగు మండలాలకు ఎంపీడీఓలను నియమిస్తూ జెడ్పీ సీఈఓ విద్యారమ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాపూరు ఎంపీడీఓ ఎం.భవానీని కలువాయికి, చిల్లకూరులో పనిచేస్తున్న ఎం.గోపీని కోటకు, వాకాడు ఏఓ శ్రీనివాసులును వాకాడుకు, తడ ఏఓ మల్లికార్జున్‌ను సూళ్లూరుపేట ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

క్లుప్తంగా

తల్లీకుమారుడిపై హత్యాయత్నం



దెబ్బతిన్న కారు

ఇందుకూరుపేట: గుర్తుతెలియని వ్యక్తులు తల్లీకుమారుడిపై హత్యాయత్నానికి ఒడిగట్టారు. ఈ ఘటన బుధవారం రాత్రి పున్నూరు రోడ్డు సమీపంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. రావూరు గ్రామానికి చెందిన ముంగర మాలిని తన కుమారుడు వైభవ్‌రెడ్డితో కలిసి నెల్లూరు నుంచి కారులో ఇంటికి బయలుదేరారు. పున్నూరు రోడ్డు సమీపానికి వచ్చేసరికి వారి కారును మరో కారు ఢీకొట్టింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న వైభవ్ కిందకు దిగి వారిని ప్రశ్నించబోయాడు. ఇంతలో ఏడుగురు మంకీ క్యాపులు ధరించి కత్తులతో వైభవ్‌రెడ్డి పైకి వచ్చారు. అప్రమత్తమైన అతను ఒక్కసారిగా కారులోకి ఎక్కి అద్దాలు వేశాడు. ఆ వ్యక్తులు కత్తులతో అద్దాలను పగులగొట్టేందుకు ప్రయత్నించారు. ఈలోగా అటుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరిని చూసి పరారయ్యారు. ఈ నేపథ్యంలో బాధితురాలు మాలిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై నాగార్జున్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీఐ సుధాకర్‌రెడ్డి గురువారం బాధితులతో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. బాధితులకు కొందరిపై అనుమానం ఉండటంతో వారి వివరాలను పోలీసులకు తెలియజేశారు.

నకిలీ బంగారం కేసులో దర్యాప్తు ముమ్మరం

ఉదయగిరి: నకిలీ బంగారం ఇచ్చిన కేసులో దర్యాప్తు ముమ్మరం చేశామని ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపారు. గుర్తుతెలియని మహిళలు ఉదయగిరిలోని ఓ బంగారు దుకాణానికి వెళ్లారు. నకిలీ బంగారం ఇచ్చి, అసలు బంగారు చైన్‌తోపాటు రూ.5 వేలు నగదు తీసుకుని బుధవారం ఉడాయించడంతో యజమాని సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో ఎస్సై గురువారం దుకాణాన్ని సందర్శించి సీసీ పుటేజిలను పరిశీలించారు. కేసుకు సంబంధించి కొంత పురోగతి సాధించామని, త్వరలోనే మహిళలను అరెస్ట్ చేస్తామని తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

వెంకటాచలం: విద్యుత్ స్తంభం ఎక్కి పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తు షాక్‌కు గురై శేషాద్రి (25) అనే యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని పూడిపర్తి గ్రామ సమీపంలోని పంట పొలాల వద్ద బుధవారం జరగ్గా గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు గ్రామానికి చెందిన దార శేషాద్రి కరెంట్ పని నిమిత్తం పూడిపర్తి గ్రామానికి బుధవారం వచ్చాడు. పొలాల వద్ద విద్యుత్ స్తంభం ఎక్కి పని చేస్తుండగా షాక్‌కు గురై కింద పడిపోయాడు. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరు నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ఈ విషయంపై మృతుడి తండ్రి వెంకటరత్నం పోలీసులకు గురువారం ఫిర్యాదు చేయడంతో మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీలో ఫ్లెక్సీల కలకలం



ఫ్లెక్సీలో కొంత భాగాన్ని చింపివేసిన దృశ్యం

ఉదయగిరి: ఉదయగిరిలో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో కొంతభాగాన్ని బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చింపివేశారు. ఆధిపత్యం కోసం కొంతకాలంగా రెండు వర్గాల మధ్య విభేదాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి ముఖ్య అనుచరులు రామయ్య, లక్ష్మయ్యలు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అందులో వెంకటరెడ్డితోపాటు అనుచరుల ఫొటోలను చింపేయడంతో టీడీపీలో కలకలం రేగింది. సొంత పార్టీలోని ఓ వర్గం వారు ఇలా చేసి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసి వాస్తవాలను వెలుగులోకి తెస్తామని చెబుతున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	100
లేయర్ (లైవ్)	75
బ్రాయిలర్ చికెన్	184
బ్రాయిలర్ స్కిన్‌లెస్	206
లేయర్ చికెన్	127

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.48
సన్నవి	రూ.30
పండ్లు	రూ.22

ఆత్మకూరు అభివృద్ధికి పరితపించి..

- రాజకీయాల్లో అజాతశత్రువు మేకపాటి గౌతమ్‌రెడ్డి
- నాడు మంత్రిగా నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి
- నేడు ఆయన వర్ధంతి



ఎంఎస్ఎంఈ పార్కు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన గౌతమ్‌రెడ్డి (ఫైల్)



నియోజకవర్గంలో పర్యటిస్తూ.. (ఫైల్)

ఆత్మకూరు: మేకపాటి గౌతమ్‌రెడ్డి.. ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతగానో పరితపించిన నాయకుడు. రాజకీయాల్లోకి వచ్చిన తొలి రోజుల్లో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు నియోజకవర్గంలో పాదయాత్ర చేశారు. సాధారణంగా రాజకీయాల్లో పార్టీల మధ్య విభేదాలతో ఒకరంటే ఒకరు పడని పరిస్థితులుంటాయి. కానీ దానికి భిన్నంగా గౌతమ్‌రెడ్డి ప్రతిపక్ష ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా పనిచేసి అజాతశత్రువుగా పేరు పొందారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అటు అధికార, ఇటు ప్రతిపక్ష నాయకుల మన్ననలు పొందిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

అనేక పనులు

గౌతమ్‌రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గంలో నారంపేట ఇండస్ట్రియల్ పార్కు తీసుకొచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేశారు. అప్పటి జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్‌తో కలిసి హైలెవల్ కెనాల్ రెండో ఫేజ్ పనులు ప్రారంభించారు. ఆత్మకూరు మున్సిపల్ ప్రజలకు సోమశిల జలాలను తాగునీటిగా అందించేందుకు ఎంజీఆర్ – అదానీ వాటర్ ప్లాంట్‌ను ఒకటో వార్డులో నెలకొల్పారు. దీని ద్వారా సుమారు 13 వార్డుల్లో ప్రజలకు నీరందుతోంది. జాబ్‌మేళాలు పెట్టి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించారు. ఎంజీఆర్ హెల్ప్‌లైన్ ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. గౌతమ్‌రెడ్డి 2022 ఫిబ్రవరి 21వ తేదీన ఆకస్మికంగా మృతిచెందారు. ఈ విషయాన్ని నాయకులు, ప్రజలు జీర్ణించుకోలేకపోయారు.

చేపలు పట్టేందుకు వెళ్లి..

- వ్యక్తి మృత్యువాత



కోటయ్య మృతదేహం

నెల్లూరు(క్రైమ్): చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నెల్లూరులోని బారాషహీద్ దర్గా సమీపంలో నెల్లూరు చెరువులో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు అంబాపురానికి చెందిన కె.కోటయ్య (50), కామేశ్వరమ్మ దంపతులకు ఐదుగురు పిల్లలున్నారు. కోటయ్య నెల్లూరు చెరువులో చేపలు పట్టుకుని వాటిని విక్రయించడం ద్వారా వచ్చిన సొమ్ముతో కుటుంబాన్ని పోషించుకోసాగాడు. అతను గురువారం బారాషహీద్ దర్గా సమీపంలోని చెరువులో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి మృతిచెందాడు. ఈ విషయాన్ని గమనించిన అక్కడున్నవారు 112కు సమాచారం అందించారు. దర్గామిట్ట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. భర్త మృతి విషయం తెలుసుకున్న కామేశ్వరమ్మ తన పిల్లలతో కలిసి ఘటనా స్థలానికి వచ్చి కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు దర్గామిట్ట ఎస్సై రమేష్‌బాబు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తుండగా..

- మైనింగ్ డీడీ దాడులు
- పలు వాహనాల సీజ్



రీచ్ వద్ద డీడీ బాలాజీ నాయక్

పొదలకూరు: అనుమతి లేని రీచ్ నుంచి రాత్రివేళల్లో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా మైనింగ్ అధికారులు దాడులు చేశారు. విరువూరు ఇసుక రీచ్‌కు మైనింగ్ డీడీ బాలాజీ నాయక్ గురువారం వచ్చారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలు, ఒక టిప్పర్, ఇసుక లోడింగ్ చేస్తున్న రెండు హిటాచీలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ విరువూరు ఇసుక రీచ్‌పై కోర్టులో స్టే ఉందన్నారు. ఇక్కడి నుంచి ఎవరూ ఇసుకను తరలించేందుకు అనుమతుల్లేవన్నారు. పోతిరెడ్డిపాళెం, సూరాయపాళెం, సంగం ఇసుక డంపింగ్ యార్డులను తనిఖీ చేసి వెళ్తుండగా ఇసుక లారీలను గమనించి విరువూరు రీచ్‌కు వచ్చినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్టు గుర్తించి రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం అందజేసి వాహనాలను సీజ్ చేశామన్నారు. వాటిని పొదలకూరు పోలీస్‌స్టేషన్లో అప్పగించడం జరిగిందన్నారు.

పది పరీక్షల నిర్వహణకు పటిష్ట చర్యలు

- డీఈఓ బాలాజీరావు



మాట్లాడుతున్న డీఈఓ బాలాజీరావు

ఆత్మకూరు: పదో తరగతి పరీక్షల నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, ప్రధానోపాధ్యాయులు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు సహకరించాలని డీఈఓ ఆర్.బాలాజీరావు అన్నారు. ఆత్మకూరు డివిజన్ స్థాయిలోని 9 మండలాల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, రెసిడెన్షియల్, కేజీబీవీ, ప్రిన్సిపల్స్‌తో పట్టణంలోని చైతన్య పాఠశాలలో గురువారం ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పాఠశాలల వారీగా వంద రోజుల ప్రణాళిక అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో పంపాలని చెప్పి రెండు రోజులైనా ఇంకా కొందరు స్పందించ లేదని, ఇది సరైన పద్ధతి కాదని హెచ్‌ఎంలను మందలించారు. దీంతో పలువురు అప్పటికప్పుడు ఆ పత్రాలను సమావేశంలో అందజేసేందుకు ప్రయత్నించడం గమనార్హం. పబ్లిక్ పరీక్షల విధి, విధానాల గురించి, డీసీఈబీ కార్యదర్శి టి.రామ్‌కుమార్ వివరించారు. ఇంకా నెల్లూరు రూరల్ విద్యాశాఖాధికారి ఆర్.మురళీధర్ మాట్లాడారు.

హెచ్‌ఎంల అసంతృప్తి

ఓరియంటేషన్ కార్యక్రమాన్ని పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో చిన్న హాల్లో నిర్వహించడంతో డిప్యూటీ డీఈఓ ఎంవీ జానకిరామ్ పట్ల పలువురు హెచ్‌ఎంలు అసంతృప్తి వ్యక్తం చేశారు. 9 మండలాలకు చెందిన వారు సుమారు వంద మందికిపైగా పాల్గొన్నారు. హాల్లో కేవలం 80 మంది మాత్రమే కూర్చొన్నారు. దీంతో పలువురు హాలు బయటే నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది.

నృసింహుని హుండీల రాబడి రూ.93 లక్షలు



హుండీ కానుకల లెక్కింపు

రాపూరు: పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని హుండీల కానుకలను శ్రీవారి క్రేన్ మండపంలో గురువారం లెక్కించారు. ఈ సందర్భంగా డీసీ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ 77 రోజులకు గానూ రూ.93,28,696 వచ్చిందన్నారు. బంగారం 220 గ్రాములు, వెండి 3.50 కేజీలు వచ్చినట్లు చెప్పారు. పలు దేశాల విదేశీ నాణేలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, జిల్లా దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి కాలువలో మహిళ మృతదేహం

వెంకటాచలం: గుర్తుతెలియని మహిళ మృతదేహం సర్వేపల్లి కాలువలో కొట్టుకుపోతుండగా మండలంలోని గొలగమూడి సమీపంలో స్థానికులు గురువారం సాయంత్రం గుర్తించారు. వివరాలు.. గ్రామానికి చెందిన కొందరు రైతులు గేదెల కోసం పొలాల వద్దకు వెళ్లగా సర్వేపల్లి కాలువలో సుమారు 35 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని మహిళ మృతదేహం కొట్టుకుపోతుండటాన్ని గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు గ్రామానికి వచ్చే సరికి చీకటి పడటంతో మృతదేహం ఆచూకీ తెలియలేదు. మహిళ ప్రమాదవశాత్తు కాలువలో పడిందా, లేక ఆత్మహత్య చేసుకుందా? అనే వివరాలు తెలియాల్సి ఉంది.

నిధులు కేటాయించాలని డిమాండ్



సమావేశంలో పాల్గొన్న నేతలు

ఉదయగిరి: వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసేందుకు వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని వెలుగొండ సాధన సమితి నేతలు డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో గురువారం వెలిగొండ ప్రాజెక్ట్ సాధన సమితి, రైతు సంఘం నేతల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగు, సాగునీరు లేక ఇప్పటికే ఉదయగిరి ప్రాంత ప్రజలు వలసబాట పడుతుండటంతో పల్లెలు ఖాళీ అవుతున్నాయన్నారు. దీనిని నివారించాలంటే వెలిగొండ ప్రాజెక్ట్ సాగునీరు ఒక్కటే మార్గమన్నారు. సమావేశంలో వెలిగొండ ప్రాజెక్ట్ సాధన సమితి నాయకులు షేక్ దస్తగిరి అహ్మద్, గాజులపల్లి రామిరెడ్డి, కాకు వెంకటయ్య, కాకు విజయమ్మ, కోడె రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొట్టడంతో..

- యువకుడి మృతి

నెల్లూరు సిటీ: కారు ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఆమంచర్ల గ్రామానికి చెందిన రమణయ్య కుమారుడు ఓజిలి కృష్ణ (20) ఓ వైన్‌షాపులో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఆమంచర్లలో సేవా జ్యోతికాలనీ వద్ద కృష్ణ బైక్‌పై వెళ్తుండగా పొదలకూరు నుంచి నెల్లూరుకు వెళ్తున్న గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.